కథ

# సూక్ష్మంలో మోక్షం

రోహిణి చింతా
హైదరాబాద్ సెల్:9553121430



"నాన్నా! చేతులు బారుగా చాపి కదలకుండా నుంచో!" అంది సుబ్బలక్ష్మి నాన్న భుజాలమీద చీరలు సర్దుతూ. "కనీసం 100 కామెంట్లు రావాలి! అసలే ఇప్పుడు పెళ్ళికొడుకు ఫ్యామిలీతో కలిపి మన వాట్సప్ గ్రూప్‌లో 250మంది ఉన్నారు"

"అబ్బా! ఏమిటే ఈ గోల! పెళ్ళి చీరలు కొనడానికి ఇంత హంగామా అవసరమా?" అమ్మ విసుక్కుంది.

"పెళ్ళికొడుకునే వాట్సప్ కామెంట్స్ ద్వారా సెలక్ట్ చేసినదాన్ని. చీరల దగ్గర తగ్గుతానా?" అంది సుబ్బలక్ష్మి రోషంగా. "అయినా నీకోసం పెళ్ళి యూట్యూబ్ లైవ్ స్ట్రీమింగ్ చెయ్యనని చెప్తేకూడా నువ్వు ఇప్పుడు నన్ను విసుక్కుంటున్నావు. ఇలా అయితే పెళ్ళి క్యాన్సిల్!"

"ఊరుకో సుబ్బూ... అమ్మ సంగతి నీకు తెలుసు కదా!" సర్దిచెప్పాడు నాన్న.

"నాన్నా! సుబ్బేమిటి గబ్బులాగా. నన్ను 'సుక్కి' అని పిలవమని చెప్పానా" చెప్పింది సుబ్బలక్ష్మి రకరకాల కోణాలనుంచి నాన్నపట్టుకున్న చీరలకు ఫోటోలు తీసి, ఒక ప్రశ్నార్థక ఇమోజి పెట్టి విచ్ వన్ అని రాసి అప్‌లోడ్ చేస్తూ, కాసేపు కూర్చో నాన్నా కామెంట్స్ వచ్చాక చీర సెలక్ట్ చేద్దామని ముగించి. నాన్న, భుజాలమీద చీరలు జాగ్రత్తగా తీసి, ప్రక్కనపెట్టి కూర్చున్నాడు. సేల్స్‌మ్యాన్ ఇది ఇప్పట్లో తేలే బేరం కాదని పక్క కస్టమర్ దగ్గరికి వెళ్ళిపోయాడు.

ఓ గంట గడిచింది. అమ్మ ఏదో వంగపండు రంగు చీరని పదే పదే చూస్తోంది. నాన్న"సుక్కీ.... కానివ్వమ్మా. కార్ ఆఫీసుకు పంపించాలి" అన్నాడు దీనంగా.

"ఓ పావుగంట ఆగు నాన్నా ఈ చీరలకి తొంభై థమ్స్ అప్ ఇమోజీలు వచ్చాయి. ఇంకో పది వస్తే అవే కొందాం. లేకపోతే అమ్మ చేతిలోవున్న వంగపండు రంగు చీరకి ఫోటోతీసి అప్‌లోడ్ చేద్దాం" అంది సుక్కి నవ్వుతూ.

అమ్మ వెంటనే వంగపండు రంగు చీర పక్కన పడేసింది. "ఛీ ఛీ! ఇది అసలు బాగోలేదు. బాగా ముదురురంగు" నాన్న గబగబా "అబ్బే పరవాలేదు సుక్కీ! అరగంట ఆగినా ఓకే. ఈ రెండు చీరలే బాగున్నాయి. ఇక కొత్తవి ఫోటోలు తియ్యొద్దు. ఇక ఆ టెన్ కామెంట్స్‌కోసం వెయిట్ చేద్దాం" అన్నాడు.

ఓ అరగంట తరువాత సుక్కి నవ్వుతూ నాన్న దగ్గరికి వచ్చింది "పెళ్ళికొడుకు 'క్యూట్ డాడ్' అని పెట్టాడు నాన్నా. చీరలకి 'ఆసమ్ సెలక్షన్' అని రెండు థమ్స్ అప్ ఇమోజీలు పెట్టాడు. ఇవే కొనేద్దాం" అంది.

నాన్న నవ్వాడు. ఇంతట్లోకి సుక్కి "నాన్నా! నువ్వు చీరలు భుజాలమీద వేసుకొని నుంచున్న ఫోటోయే నా కొత్త డి.పి.

నాన్న బిత్తరపోయాడు, అమ్మ తలబాదుకుంది. కౌంటర్ దగ్గర బిల్లు చెల్లిస్తూ, అమ్మ చేతిలో మిగిలిన క్యాష్, కార్డు పెట్టి "నగలు కొనడానికి మీరిద్దరూ వెళ్ళండి" అన్నాడు నాన్న.

"ఏమండీ.."అంది అమ్మ కొంచెం కంగారుగా.

"నేను పాపిడిబిళ్ళ, మాటీలు, గాజులు వేసుకుంటే అసహ్యంగా ఉంటా" అంటూ నాన్న నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. అమ్మా, సుక్కి నగలకొట్టు దగ్గర కారు దిగుతుంటే సుక్కి పడి, మోకాలికి చిన్న దెబ్బ తగిలించుకుంది.

"అయ్యో! చూడనీ" అంది అమ్మ.

సుక్కి లెగ్గింగ్ కాస్త పైకెత్తి దెబ్బను చూసుకొని బాధపడి, దెబ్బకి ఓ ఫోటో తీసింది.

"ఫోటో దేనికి" అమ్మ ఆశ్చర్యపోయింది.

"మా వాట్సప్ గ్రూపులో పెట్టడానికి" అంటూ సుక్కి ఒక విచారించే ఎమోజ్ పెట్టి ఫోటో అప్‌లోడ్ చేసింది. వెంటనే ఓ యాభై విచారించే ఎమోజీలు, టేక్‌కేర్ అనే కామెంట్స్ వచ్చాయి. సుక్కి బాధ మరచిపోయింది.

"అమ్మో నయం... మోకాలికి తగిలింది!" అంటూ అమ్మ గుండెలమీద చెయ్యి వేసుకుంది.

నగలకొట్టులో ప్రతి నగకి ఆరు ఫోటోలు తీసి వాట్సప్ గ్రూపులో పెట్టి, మంచి కామెంట్స్ వస్తే కొనడం, ఆఖరికి తాళిబొట్టుకికూడా గ్రూపులో స్మైలీలు వచ్చాకే కొంది సుక్కి. ఇదంతా చూసి అమ్మకి తలనొప్పి, వికారం వచ్చింది. కానీ సుక్కి ఏమాత్రం తగ్గలేదు. సాయంత్రం వియ్యాలవారు హోటల్‌లో డిన్నర్‌కి రమ్మంటే సుక్కి వెంటనే మూడు డ్రస్‌లకి ఫోటోలు తీసి ఎక్కువ కామెంట్స్ వచ్చిన దాన్ని వేసుకొని హోటల్‌కి వెళ్ళింది.

"డ్రస్ బాగుంది" అన్నాడు పెళ్ళికొడుకు.

"మన గ్రూపులో కామెంట్స్ వచ్చాయి" అంది సుక్కి నవ్వుతూ.

"నేనుకూడా కామెంట్ చేసాగా" అన్నాడు పెళ్ళికొడుకు.

"మీ బూట్లకి నేనుకూడా కామెంట్ చేసా" అంది సుక్కి సిగ్గుపడుతూ.అమ్మకి చాలా నిరుత్సాహంగా అనిపించింది. పోనీ కొంచెం భోజనం చేసి ఇంటికి వెడదామనుకుంటే చెంచా ఎత్తేసరికి 'ఫ్యామిలీ సెల్ఫీ టైమ్' అంటూ ఫోటోలు తియ్యడంతో తిన్న తృప్తి లేకుండా పోయింది. హోటల్‌లో గ్లాసులకీ, చెంచాలకీ, వడ్డించిన పదార్థాలకి ఫోటోలు తీసి వాట్సప్ గ్రూపులో పెట్టి 'అబ్బా! ఆకలివేస్తోంది, అబ్బా! నోరూరిపోతోంది' అని కామెంట్లు చదివి కడుపులు నింపేసుకున్నారు సుక్కి, పెళ్ళికొడుకు. అమ్మానాన్నమాత్రం ఇంటికెళ్ళి, ఫోన్ స్విచాఫ్ చేసి, అన్నం వండుకొని పచ్చడేసుకొని తిని, పడుకున్నారు.

అమ్మ ఇంక పెళ్ళి పనుల్లో కలగజేసుకోను అంది. దాంతో సుక్కి, పెళ్ళికొడుకూ రెచ్చిపోయి, వాట్సప్ గ్రూపులో 250మందితో కలిసి పెళ్ళికార్డులు, పెళ్ళిలో పెట్టే వంటలు, పిండివంటలు, చెప్పులూ, చెంపపిన్నులు, జాకెట్లు, జరీపంచెలూ అన్నీ కొనేసుకున్నారు.

పెళ్ళిరోజైతే పెళ్ళికొడుకూ, సుక్కి, చుట్టాలు (గ్రూపులోవున్న 250మంది) రకరకాలుగా ఫోటోలు తీసి, వాళ్ళ గ్రూపులోనే పెట్టుకొని వాళ్ళే కామెంట్ చేసుకొని ఆనందించారు. బాసికం కట్టుకుంటూ, దండలు వేసుకుంటూ, పంతులుతో మాట్లాడుతూ, తలంబ్రాలు మంచి మంచి ఫోజుల్లో పోసుకుంటూ, ఆపుతూ, ఫోటోలు తీసుకుంటూ, మధ్య మధ్యన పెళ్ళిచేసుకుంటూ 'బిగ్ మూమెంట్ టైమ్' అని 'శుభవేళ వచ్చెనే' అని క్యాప్షన్లు ఆలోచించి పెట్టుకుంటూ మళ్ళీ సమయం చిక్కినప్పుడు మధ్య మధ్య పెళ్ళి చేసుకుంటూ భలే ఆనందపడ్డారు. అమ్మానాన్నా చివరి కుర్చీలో కూర్చుని ఇవన్నీ ఎంతో విచారంతో చూస్తూవున్నారు.

పెళ్ళై వెళ్ళిపోతూ సుక్కి మొహం బాధగాపెట్టి, ఓ ఫోటో తీసి 'టియర్‌ఫుల్ ఫేర్‌వెల్..., మిస్ యూ మామ్ అండ్ డాడ్' అని ఏడుపుగొట్టు ఎమోజీ పెట్టి వాట్సప్‌లో పెట్టింది. రిప్లైలో ఒక 150మంది 'యస్ వుయ్ అండర్‌స్టాండ్' అని అదే ఏడుపుగొట్టు ఎమోజి పెట్టారు. సుక్కి ఎంతో ఆనందించి, చటుక్కున కారెక్కి అమ్మకి, నాన్నకి టాటా అయినా చెప్పకుండా వెళ్ళిపోయింది. అమ్మకి అసహ్యం వేసింది.

సత్యనారాయణ వ్రతానికి కూర్చొని, దేవుడి పటాలమీద పూలు జాగ్రత్తగా సర్ది, ప్రసాదం ఎవ్వరికీ పెట్టకుండా, గిన్నెలు అందంగా అమర్చి, ఓ ఫోటో తీసి, ఓ నమస్కారం ఎమోజీ పెట్టగానే రిప్లైలో వంద నమస్కారాలు వచ్చాయి.

పెళ్ళైన మూడో రోజు బీదసాదలకి అన్నం పెట్టడానికి వెళ్ళి ఆకలితో మాడుతూ, భోజనంకోసం ఆత్రంగా ఎదురుచూసేవారి చేతుల్లో వడించిన విస్తరిపెట్టి, తీరా ఫోటోలు అప్‌లోడ్ చేద్దామంటే ఇంటర్‌నెట్‌లేక డేటాకార్డు వచ్చేదాకా బీదవారి నోటికి ముద్ద అందకుండా జాగ్రత్తగా ఆపి, ఫోటోలు తీసి పళ్ళు, ఫలహారాల ఎమోజీతో పెళ్ళికొడుకూ, సుక్కి 'అవర్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ' అని రాసి అప్‌లోడ్ చేశారు. 250మంది మాత్రం చప్పట్ల ఎమోజీలు పెట్టారు.

తరువాత శోభనం గదిలో మంచాలూ, పళ్ళూ, అగరవత్తులూ ఫోటోలు వాట్సప్‌లో పెట్టి ఓ కన్నుకొట్టే స్మైలీతో అప్‌లోడ్ చేసి 'మోర్ టు కమ్' అని పెడితే రిప్లైలో 'వెయిటింగ్ ఈగర్లీ' అని ఓ స్మైలీ వస్తే అది చూసి అమ్మకి ప్రాణం పోయినంత పనైంది.

"ఏవండీ! ఇంకేం ఫోటోలు పెడతారో! ఏమన్నా చేయండీ" అని అరిచింది ఆవేదనగా. నాన్నకి ఒక్క క్షణం ఏమీ తోచలేదు. వెంటనే ఇంటర్‌నెట్ ప్లగ్ పీకేసాడు.

"మొబైల్ డేటా...?" అమ్మ అడిగింది. నాన్న వెంటనే మెయిన్స్ ఆపేశాడు. ఇల్లంతా చీకటి. "నే వచ్చేదాకా వాళ్ళ గది తలుపు గొళ్ళెం వేసి ఉంచు, అడిగినా క్యాండిల్‌కూడా ఇవ్వకు. మొబైల్ టార్చ్‌తో ఫోటోలు అట్టే సరిగ్గా రావని అనుకుందాం. అయినా జాగ్రత్త. నేను ఇప్పుడే ఆఫీసుకెళ్ళొస్తా" అంటూ రయ్యిన ఆఫీసుకెళ్ళిపోయాడు. అమ్మ ఒకటే ఏడుపు. సుక్కి తలుపుకొట్టినా పట్టించుకోలేదు అమ్మ. నాన్న నలభై నిమిషాల్లో ఇంటికి వచ్చి, నేరుగా డాబామీదకి వెళ్ళి, ఓ పావుగంట తరువాత కిందికి వచ్చి, మెయిన్స్ ఆన్ చేసి రుమాలుతో తల తుడుచుకుంటూ ఆఫీసులో వాడే 'మొబైల్ జన్నర్స్' పెట్టా ఇక అరిచి గీపెట్టినా సిగ్నల్ రాదు" అన్నాడు. అమ్మ కొంచెం శాంతించింది.

మర్నాడు నాన్నని ఆఫీసువాళ్ళు జన్నర్స్ తిరిగి ఇచ్చేయమని, లేకపోతే పదివేల రూపాయల జరిమానా వేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నా ఉద్యోగం పీకేసినా, జైల్లో పెట్టినా, ఆస్తి మొత్తం తీసేసుకున్నా జన్నర్స్ మాత్రం ఇవ్వను అని నాన్న చెప్పాడు. ఎప్పుడూ ఓ పెన్ అయినా ఎవరి దగ్గరా తీసుకోని నాన్న ఇలా చేసినందుకు ఏదో బలమైన కారణం ఉంటుందని ఆఫీసువాళ్ళు ఇక ఆ విషయం వదిలేసారు. నాన్న జన్నర్స్‌కి ఒక బలమైన ఇనుపబోన్ చేయించి, తాళంవేసి తాళం విసిరేశాడు. సుక్కి విషయం తెలుసుకొని, డాబాపైకి

# ఎదగడమంటే....

పూజలు ఎన్ని చేసినాకానీ
పురాణాలు పఠించినాకానీ
వేదాధ్యయనం చేసినాగానీ
మనిషెదగకుంటే ఏం ప్రయోజనం
స్తోత్రాలెన్ని నోటికొచ్చినా
మంత్రజపాలు కోట్లు చేసినా
సహస్రనామపు గుంపులో చేరినా
మనిషెదగకుంటే ఏమి ప్రయోజనం
ప్రవచనాలు సహస్రం విన్నా
గుళ్ళూ, దేవుళ్ళంటూ తిరిగినా
భగవద్గీతను బట్టీ పట్టినా
మనిషెదగకున్నచో ఏం ప్రయోజనం
దానధర్మాలు చేయని చేతులు
కాకికైనా మెతుకు విదల్చని చేతులు
సాటివారిలో దేవుని చూడని
మనిషెదగకున్నా అతడేం ప్రయోజనం
దయగల హృదయమే దైవమందిరం
పరోపకారమే ఇదం శరీరం
మానవసేవయే మాధవసేవ
ఇది ఉంటేనే ఎదిగావనుకో
ఆత్మస్వరూపం తెలిసిందనుకో
పవిత్రమైన మనసే పత్రం
నిర్మలమైన హృదయం పుష్పం
దయతో కూడిన దేహమే ఫలం
కరుణతోకారే కన్నీరే తోయం
ఇవి ఉంటేనే ఎదిగాననుకో
ఆత్మస్వరూపం తెలిసిందనుకో

కొమ్మమూరి సుబ్బలక్ష్మి, చెన్నై,
సెల్:9003159927

# అరదండాలు

ఆడ, ఈడ, ఏడ చూచినా నిత్యం
ఏ-సి-బి దాడుల దడదడలు
వార్తాపత్రికల్లో దర్శనమిచ్చే ఘటనలు
ఫ్రెంటు పేజీలో ప్రింటయ్యే కథనాలు
పదే పదే ఆగక ప్రసారం చేసే టీవీలు
అవినీతి సుందరవదనాల చిత్రాలు
అత్యాశ బీజాలకు అంకురించిన
రకరకాల వికార కోరికల కోరలు
ఆడామగా తేడాలేని వీర విజృంభణ
ఆశల విషవలయ ధనదాహానికి
బరితెగించిన అవినీతి తిమింగిలాలు
కాలం కలిసిరాక బెడిసి కొట్టినవేళ
మెలిక తిరిగిన నులకతాడనుకొని
పొరబడి పగబట్టిన త్రాచుకాటుకు బలి
ఏ,సి,బి గాలాల కొక్కేలకు పక్కాగా చిక్కి
దిక్కు తోచక అన్ని దిక్కులు దృక్కులు
జెండాకట్టెలు ఆపుక్రై అర్రులు చాచి
'మ' కు కొమ్మే సున్న 'ద'కారాలై
సాంప్రదాయ తీరుకు ముఖానికి ముసుగు
కన్నవారు కట్టుకొన్నవారంతా
తలపట్టుకొని కొట్టుకొని నిశ్శబ్ద రోదన
సంపాదనతోపాటు ఉద్యోగం ఊడినవేళ
మురిపెంగా ముగ్గులోకిదించిన
అత్తా, ఆలూ అయినవారూ ఆపసోపాలు
కట్టుదిట్టమైన చట్టం పరిధిలో
అక్రమార్జనపరులకు తప్పని అరదండాలు

సింగార సుబ్బారావుయుడు
తిరుపతి, సెల్:8374012691

# పద్యాలు

పారమార్థికంబు ఫలితవిలువలీయ
నిలిపి చూపె రదిగొ నేతలట్లు
విలువ లేర్పరచిన విత్తమీయుగదరా
రావు నుడువు మాట రాచబాట

నాయకత్వ మనిన న్యాయవర్తనములే
కీడు చేయ తొలుగు కీర్తికాంత
పరువు బాసి నాంక ప్రాణములుందునా
రావు నుడువు మాట రాచబాట

పాలనమును చొరవ పారదర్శకముగ
జనుల మేలు కొరకు జాగృతవగ
ప్రబలమవుతు నిలిచె ప్రజాస్వామ్య పథము
రావు నుడువు మాట రాచబాట

గెలిచి ఓడి గెలువ గీటురాయిగమారె
ఓటు నిలిచి చూపె ఓటి కాక
ముఖ్యనేతలంత మునిగితేలిరి చూడు
రావు నుడువు మాట రాచబాట

నేతలెప్పుడైన నియంతృత్వ పథము
సాగినపుడెల్ల సమర మగును
ప్రజలమెప్పుపొందె ప్రజాస్వామ్యమవని
రావు నుడువు మాట రాచబాట

అధిక బరువు చేత అధిష్ఠానముగాగ
నాయకత్వ సరళి నాటిరదిగొ
నేలమట్టమవగ నియంతృత్వ సరళి
రావునుడువు మాట రాచబాట

డా॥కాసర్ల రంగారావు
హన్మకొండ, సెల్:9493122306

17వ పేజీ తరువాయి భాగం

వెళ్ళి జన్నర్స్‌కి ఫోటోతీసి ఒక విచారించే ఎమోజీ పెడదామని ప్రయత్నించింది. కానీ అది ఎంతకీ అప్‌లోడ్ అవ్వలేదు. అమ్మ హాయిగా ఊపిరి పీల్చుకుంది. మంచి కాఫీ చేసి నాన్నకి ఇచ్చి తనుకూడా తాగుతూ ఎంజాయ్ చేస్తూ కూర్చుంది. ఇంతలో సుక్కి వచ్చి "నాన్నా జన్నర్స్ తీసేయ్, లేకపోతే..." అని బెదిరించబోయింది. నాన్న కాఫీ తాగుతూ తలెత్తికూడా చూడకుండా "నీ ఇష్టం సుబ్బలక్ష్మి ఏదైనా చెయ్, నేను జన్నర్స్ తీసే ప్రసక్తి లేదు' అని కచ్చితంగా చెప్పేసాడు. సుబ్బలక్ష్మి ఇక చేసేదేమీ లేక. మారు మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. అమ్మ, నాన్నకేసి ప్రేమగా చూసి నవ్వుతూ "సూక్ష్మంలో మోక్షం చూపించారండీ" అంది. నాన్న ప్రశాంతంగా నవ్వాడు.

*